క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

హసన్‌పర్తి: చింతగట్టు సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఆదివారం ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ ప్రదీప్‌కుమార్ తెలిపారు. దేవన్నపేట, మధు తండా, అలియా తండా, కోమటిపల్లి, సుబ్బయ్యపల్లిల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని ఏఈ ప్రదీప్‌కుమార్ కోరారు.

సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం ఎర్రగట్టు గుట్ట సమీపంలోని తెలంగాణ రాష్ట్ర బాలిక గురుకుల కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో బైపీసీలో 25 సీట్లు, ఎంఈసీలో 8 సీట్లు ఖాళీగా ఉన్నాయని ప్రిన్సిపాల్ ఇందుమతి ఒక ప్రకటనలో తెలిపారు. టీఎస్ఆర్‌జేసీ-2023 సెట్‌లో అర్హత సాధించిన వారు దరఖాస్తులు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థినులు ఈనెల 6నుంచి 8వ తేదీ లోపు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు.

అనాథ పిల్లలకు నిత్యావసరాల పంపిణీ



మామునూరు: ఖిలా వరంగల్ మండలం మామునూరు టీఎస్ఎస్పీ నాలుగు, ఐదవ బెటాలియన్ కమాండెంట్ శివప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో స్పెషల్ పోలీసులు నేతృత్వంలో న్యూలైఫ్ సొసైటీ బాలబాలికల అనాథాశ్రమ పిల్లలకు శనివారం నిత్యావసర సరుకులు, పుస్తకాలు పంపిణీ చేశారు. సిబ్బందికి డీకాయ్ అన్యువల్ రిఫ్రెషర్ కోర్స్ పూర్తైన సందర్భంగా స్పెషల్ పోలీసులు న్యూలైఫ్ అనాథ ఆశ్రమాన్ని సందర్శించారు. వారికి పుస్తకాలు, పెన్నులు, నిత్యావసర సరుకులు అందజేసి తమ సేవా దాతృత్వాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో స్పెషల్ కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

అదనపు కట్నం కోసం వేధింపులు



హసన్‌పర్తి: భర్త, అత్తమామలు అదనపు కట్నం వేధిస్తున్నారని బాధితురాలు తెలిపింది. ఈమేరకు గోపాలపురంలోని తన భర్త ఇంటి ఎదుట శనివారం ధర్నాకు దిగింది. గోపాలపురానికి చెందిన కాశీ విశ్వనాథ్‌కు విద్యతో ఐదేళ్ల క్రితం వివాహం జరిగింది. ప్రస్తుతం విశ్వనాథ్ జనగామలోని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్‌లో మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఆ దంపతులకు ఓ సంతానం. పెళ్లి అయినప్పటి నుంచి భర్త, అత్తమామలు కట్నం కోసం వేధిస్తున్నారని బాధితురాలు ఆందోళన వ్యక్తం చేసింది. న్యాయం చేయాలని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోయింది.

వేడుకల్లో తల్వార్‌తో హల్‌చల్

హసన్‌పర్తి: బర్త్‌డే వేడుకల్లో తల్వార్‌తో హల్‌చల్ చేసిన ఘటనలో సదరు వ్యక్తిపై కేసు నమోదైంది. కాకతీయ యూనివర్సిటీ పోలీసుల కథనం ప్రకారం నగరానికి చెందిన కార్తీక్ తన బర్త్‌డే వేడుకలను చింతగట్టులోని బీజీఆర్ గార్డెన్‌లో శుక్రవారం రాత్రి నిర్వహించాడు. ఈ సందర్భంగా తల్వార్‌తో విన్యాసం చేశాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని తల్వార్‌ను స్వాధీనం చేసుకున్నారు. కార్తీక్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేష్ తెలిపారు.

కార్యకర్తల బైండోవర్

కాజీపేట: కాజీపేట తహసీల్దార్ భావుసింగ్ ఎదుట పలు రాజకీయ పార్టీలకు చెందిన కార్యకర్తలను పోలీసులు శనివారం బైండోవర్ చేశారు. అన్ని రాజకీయ పార్టీల ముఖ్య కార్యకర్తలతో పాటు మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి కార్యకర్తలకు తహసీల్దార్ పలు సూచనలు చేశారు. ఎన్నికల నియమాలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

గంగపుత్ర సంఘం నగర అధ్యక్షుడిగా శ్రీనివాస్



హన్మకొండ: తెలంగాణ గంగపుత్ర సంఘం వరంగల్ నగర అధ్యక్షుడిగా హనుమకొండలోని రెడ్డి కాలనీకి చెందిన పూస శ్రీనివాస్‌ను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు ధీటి మల్లయ్య ఉత్తర్వులు జారీ చేశారు. ఈమేరకు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

ఎన్నికలకు దూరంగా టీడీపీ

వరంగల్ / హన్మకొండ: ఈసారి అసెంబ్లీ ఎన్నికలకు టీడీపీ దూరంగా ఉంటుందని ఆ పార్టీ వరంగల్ పార్లమెంట్ అధ్యక్షుడు అర్షనపల్లి విద్యాసాగర్ రావు అన్నారు. హనుమకొండ సర్క్యూట్ హౌస్ రోడ్డులోని పార్టీ కార్యాలయంలో టీడీపీ వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరంగల్ పార్లమెంట్ పరిధిలో టీడీపీ పోటీ చేయడం లేదని స్పష్టం చేశారు. పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హనుమకొండ సాంబయ్య, రాష్ట్ర కార్యదర్శి బాబాఖాదర్ అలీ, రాష్ట్ర టీచర్స్ సంఘం అధ్యక్షుడు ముంజ వెంకట్రాజం పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై పోరాడాలి

- పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నర్సింహారావు
- నేటినుంచి విద్యార్థి అమరవీరుల సంస్మరణ సభలు



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

కేయూ క్యాంపస్ : విద్యార్థి అమరువీరుల స్ఫూర్తితో విద్యారంగ సమస్యలపై పోరాడాలని ప్రగతిశీల ప్రజాస్వామిక విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.నర్సింహారావు పిలుపునిచ్చారు. ఈ మేరకు విద్యారంగ రక్షణ, హక్కుల కోసం శాస్త్రీయ విద్యావిధానానికి విప్లవ విద్యార్థి ఉద్యమనిర్మాణంలో పనిచేస్తూ రాజ్యహింసకు, శత్రువుల దాడుల్లో, భూటకపు ఎన్‌కౌంటర్లల్లో తమ ప్రాణాలను బలిదానం చేసిన విద్యార్థి అమరవీరుల సంస్మరణ సభలను నేటినుంచి 11వరకు తేదీవరకు నిర్వహిస్తున్నట్లు ఆయాసభలను విజయవంతం చేయాలన్నారు. శనివారం కాకతీయ యూనివర్సిటీ మొదటి గేట్‌వద్ద విద్యార్థి అమరుల సంస్మరణ సభలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తమ ప్రాణాలను త్యాగం చేసిన జార్జిరెడ్డి, జంపాల చంద్రశేఖర్, ప్రసాద్, శ్రీపాద శ్రీహరి, దుస్సా చేరాలు, రంగవల్లి, మాలోజు వీరన్నలాంటి విప్లవ వీరుల సంస్మరణ సభలను విజయవతం చేయాలన్నారు. ప్రైవేటు, కార్పొరేట్ యాజమాన్యాలకు అనుకూలంగా సంస్కరణలు తీసుకొస్తూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల విద్యార్థులను ఉన్నత విద్యకు దూరం చేస్తున్నాయని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఆలువాల నరేష్, జిల్లా కమిటీ బాధ్యులు అశోక్, వినయ్, ప్రవీణ్, సంగీత, కావేరి, రమేష్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ సామగ్రి సిద్ధం



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

కరీమాబాద్: వరంగల్ తూర్పు, నర్సంపేట, వర్ధన్నపేట నియోజకవర్గాల్లోని 791 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన పోలింగ్ సామగ్రి సిద్ధంగా ఉందని వరంగల్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు. కలెక్టరేట్‌లో శనివారం పోలింగ్ సామగ్రిని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ కామన్ అడ్రస్ ట్యాగ్స్, బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్ కరదీపిక, పోలింగ్ అధికారుల చెక్ లిస్ట్, ఎంసీసీ నియమావళి తదితర సామగ్రి పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. ఎన్నికలను ప్రశాంత, స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ వాసుచంద్ర, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సురేష్, ఎన్నికల పర్యవేక్షకుడు విశ్వనారాయణ తదితరులు పాల్గొన్నారు.

‘సీజ్’ సమస్యలకు పరిష్కారం

కరీమాబాద్: ఎన్నికల్లో నగదు సీజ్ సమస్యలను గ్రీవెన్స్ కమిటీ ద్వారా పరిష్కరించనున్నట్లు వరంగల్ జిల్లా గ్రీవెన్స్ కమిటీ కన్వీనర్ సంజీవరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో నగదు, ఇతర వస్తువులు స్వాధీనం చేసుకుంటే తగిన ఆధారాలు, పత్రాలు చూపిస్తే వాటిని తిరిగి ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. వరంగల్ తూర్పు, నర్సంపేట, వర్ధన్నపేట నియోజకవర్గాల పరిధిలో ఇప్పటి వరకు రూ.1,15,44,170 స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. తగిన ఆధారాలు చూపించడంతో వాటిని ప్రజలకు తిరిగి ఇచ్చినట్లు ఆయన తెలిపారు. సమస్యలు ఎదురైతే 91001 15732 గ్రీవెన్స్ సెల్ నంబర్‌లో సంప్రదించాలని సంజీవరెడ్డి కోరారు.

టెన్త్ పరీక్ష ఫీజు గడువు ఈనెల 17

కాశీజీ సెంటర్: పదో తరగతి వార్షిక పరీక్షలకు హాజరుకానున్న విద్యార్థులు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా ఈనెల 17వ తేదీ వరకు పరీక్ష ఫీజు చెల్లించాలని వరంగల్ డీఈఓ వాసంతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.50 అపరాధ రుసుముతో డిసెంబర్ ఒకటో తేదీ వరకు, రూ.200తో డిసెంబర్ 11, రూ.500తో 20 వరకు చెల్లించడానికి అవకాశం ఉందని పేర్కొన్నారు. రెగ్యులర్ విద్యార్థులు రూ.125, ఫెయిలైన వారు మూడు, అంతకన్న తక్కువ సబ్జెక్టులకు రూ.110, మూడు కన్నా ఎక్కువ ఉంటే రూ.125 ఫీజు చెల్లించాలని సూచించారు.

వీరస్వామికి సన్మానం

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని పొలిటికల్ సైన్స్ విభాగం అధిపతిగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ కే.వీరస్వామిని కాకతీయ యూనివర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం (కుక్టా) నాయకులు శనివారం సన్మానించారు. కార్యక్రమంలో బాధ్యులు పాల్గొన్నారు.

బీజేపీని ఓడిస్తేనే రాజ్యాంగ రక్షణ

హసన్‌పర్తి : బీజేపీని ఓడిస్తేతేనే రాజ్యాంగాన్ని రక్షించుకోలగమని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్రాములు సూచించారు. మనుధర్మ శాస్త్రాన్ని అమలు చేయాలని చూస్తున్న బీజేపీని ఓడించాలని పిలుపునిచ్చారు. భారత రాజ్యాంగాన్ని అమలు చేయడానికి ప్రధాని మోదీ సిద్ధంగా లేరని తెలిపారు. హసన్‌పర్తి మండల కేంద్రంలోని ఓ గార్డెన్‌లో రెండు రోజుల పాటు నిర్వహించిన వ్యవసాయ కార్మిక మహిళా కూలీల రాష్ట్ర సదస్సు శనివారం ముగిసింది.

మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



మాట్లాడుతున్న డాక్టర్ బండా ప్రకాశ్

కరీమాబాద్: రాష్ట్రం బంగారు తెలంగాణ దిశగా సాగుతున్న నేపథ్యంలో బీఆర్ఎస్ అధికారంలోకి రావాలనే ఆవశ్యతను తెలుపుతూ రూపొందించిన బీఆర్ఎస్ మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని శాసనమండలి డిప్యూటీ చైర్మన్, బీఆర్ఎస్ వరంగల్ తూర్పు ఇన్‌చార్జ్ డాక్టర్ బండా ప్రకాశ్ సూచించారు. గ్రేటర్ పరిధిలోని ఉర్సుగుట్ట ఆకుతోట కన్వెన్షన్ హాల్‌లో బీఆర్ఎస్ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి నన్నపునేని నరేందర్ ఆధ్వర్యంలో 32, 33, 34, 35, 36, 39వ డివిజన్లకు చెందిన బాధ్యులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకాశ్ మాట్లాడుతూ కార్యకర్తలు ప్రజల్లో ఉంటూ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించాలని కోరారు. కాంగ్రెస్ హత్యా రాజకీయాలు, బీజేపీ కుల, మతాల మధ్య చిచ్చుపెట్టే విషయాన్ని ఎండగట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఖాదీ బోర్డు చైర్మన్ మౌలానా, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

రాష్ట్రంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే

- పార్టీ పశ్చిమ అభ్యర్థి రాజేందర్ రెడ్డి



తండాలో ప్రచారం చేస్తున్న రాజేందర్‌రెడ్డి

హన్మకొండ: రాష్ట్రంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమని కాంగ్రెస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, కాంగ్రెస్ వరంగల్ పశ్చిమ అభ్యర్థి నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. హనుమకొండలోని రాంనగర్ బంజారా కాలనీ, క్రాంతినగర్, నెహ్రూనగర్, రాజాజీ నగర్, రాంనగర్‌లో రాజేందర్ రెడ్డి శనివారం రాత్రి ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ఓటర్లను స్వయంగా కలిసి తనకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు.

షార్ట్ సర్క్యూట్‌తో వెల్డింగ్ షాప్ దగ్ధం



హన్మకొండ: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో వెల్డింగ్ వర్క్స్ దుకాణం దగ్ధమైన ఘటన హనుమకొండ అలంకార్ జంక్షన్ సమీపంలో శనివారం జరిగింది. షాపు యజమాని, బాధితుడు రాసమల్ల సంతోష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హనుమకొండలోని అలంకార్ జంక్షన్ సమీపంలోని శరత్ ఐ ఆస్పత్రి ఎదురుగా ఉన్న దుకాణాన్ని రోజు మాదిరిగా శుక్రవారం రాత్రి మూసివేసి ఇంటికి వెళ్లాడు. శనివారం ఉదయం 5గంటలకు దుకాణంలో నుంచి దట్టమైన పొగలు రావడాన్ని పక్కనే మసీదులో నమాజ్ చేసుకోవడానికి వచ్చిన ముస్లింలు గమనించారు. వెంటనే దుకాణ యజమానితో పాటు ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. మంటలను సంతోష్ ఆర్పే ప్రయత్నం చేశారు. అగ్నిమాపక సిబ్బంది సైతం సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను పూర్తిగా ఆర్పివేశారు. అయితే అప్పటికే రిపేర్ కోసం దుకాణంలో ఉంచిన 5 మోటార్ సైకిళ్లు, స్పేర్ పార్ట్స్, హైడ్రాలిక్ మిషన్ పూర్తిగా దగ్ధమైందని దుకాణ యజమాని సంతోష్ వాపోయాడు. సుమారు రూ.6 లక్షల వరకు ఆస్తినష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశాడు.

సంక్షిప్తంగా

పాస్టర్స్ ఫెలోషిప్ నుంచి తొలగింపు

కాశిబుగ్గ: వరంగల్ పాస్టర్స్ ఫెలోషిప్‌కు వ్యతిరేకంగా పనిచేస్తున్న కొంతమందిని ఫెలోషిప్ నుంచి తొలగిస్తునట్లు ఫెలోషిప్ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ తెలిపారు. ఓసిటీలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫెలోషిప్ సెక్రటరీ పాస్టర్ వీపీ యోబు, చైర్మన్ కొర్లపాటి జేమ్స్, కోశాధికారి జనార్దన్, వైస్ ప్రెసిడెంట్ పాస్టర్ జన్ను ప్రమోద్.. ఫెలోషిప్‌కు వ్యతిరేకంగా కార్యక్రమాలు నిర్వహిస్తూ అప్రతిష్టపాలు చేస్తున్నారని అన్నారు. వారిని వరంగల్ పాస్టర్స్ ఫెలోషిప్ నుంచి తొలగిస్తున్నట్లు సభ్యులంతా తీర్మానం చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో ఫెలోషిప్ వైస్ చైర్మన్ డేవిడ్ కుమార్, చీఫ్ అడ్వైజర్ పాస్టర్ అబ్రహం, జాయింట్ సెక్రటరీ జుపాక యాకోబ్, ఎలైజా, విల్సన్, కాలేబు, ఆదాం, ఆరోగ్యం తదితరులు ఉన్నారు.

హాస్టల్ విద్యార్థినుల సమస్యలు పరిష్కరించాలి

విద్యారణ్యపురి: హనుమకొండ నగరంలోని జులైవాడలోని గర్ల్స్ హాస్టల్‌లోని విద్యార్థినుల సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్ డిమాండ్ చేశారు. ఈమేరకు హాస్టల్‌ను శనివారం సందర్శించి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ హాస్టల్ వద్ద నిరసన తెలిపారు. బీఎస్ఎఫ్ కేయూ ఇన్‌చార్జ్ కల్లెపెల్లి ప్రశాంత్, ఏబీఎస్ఎఫ్ యూనివర్సిటీ అధ్యక్షుడు చెల్పూరి శ్రీకాంత్, మచ్చ పవన్‌కల్యాణ్, వినోద్ పాల్గొన్నారు.

శ్రీచైతన్య పాఠశాల విద్యార్థుల ప్రతిభ

వరంగల్: జాతీయ స్థాయిలో నిర్వహించే నాలెడ్జ్ అసెస్‌మెంట్ పరీక్షలో వరంగల్ ఎల్‌బీనగర్ శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబర్చినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బండారి కిరణ్‌కుమార్ తెలిపారు. వ్యక్తిగత శ్రద్ధ, మైక్రోప్లాన్లతో ఈ ఫలితాలను సాధించారని తెలిపారు. ఉత్తమ ఫలితాలను కనబరిచిన విద్యార్థులను అభినందించారు. పాఠశాల డీన్ రంజిత్, బ్యాచ్ ఇన్‌చార్జ్ జనార్దన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాలెడ్జ్ అసెస్‌మెంట్ టెస్ట్‌లో విద్యార్థుల ప్రతిభ

ఖిలా వరంగల్: ఐఐటీ ఫౌండేషన్ నిర్వహించిన నాలెడ్జ్ అసెస్‌మెంట్ టెస్ట్‌లో వరంగల్ శంభునిపేటలోని రెనాల్డ్స్ హైస్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. అర్హత సాధించిన విద్యార్థులను పాఠశాల ప్రాంగణంలో ప్రిన్సిపాల్ శ్రీధర్ ఆధ్వర్యంలో శనివారం అభినందించారు. కార్యక్రమంలో చైర్మన్ శ్రీధర్, శ్రీవిద్య, రాజేశ్వర్‌రెడ్డి, రాంకీ, మహేష్, శ్రీహరి, వెంకటేష్, సతీష్ పాల్గొన్నారు.

సెయింట్ పీటర్స్ స్కూల్‌లో మాక్ అసెంబ్లీ

హన్మకొండ: హనుమకొండ విద్యానగర్‌లోని సెయింట్ పీటర్స్ ఎడ్యు స్కూల్‌లో శనివారం మాక్ అసెంబ్లీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ నారాయణ రెడ్డి, ప్రిన్సిపాల్ హరిత మాట్లాడుతూ విద్యార్థులకు రాజకీయాలు, చట్టసభలపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని రూపొందించినట్లు తెలిపారు.

రైలుకింద పడి వ్యక్తి ఆత్మహత్య

కాశిబుగ్గ : రైలుకింద పడి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన వరంగల్-కాజీపేట రైల్వేస్టేషన్ల మధ్య శుక్రవారం రాత్రి జరిగింది. జీఆర్పీ సీఐ నరేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. వరంగల్ జిల్లా దుగ్గొండి మండలంలోని లక్ష్మీపురం బంధంపల్లి గ్రామానికి చెందిన మాదం రవి(42), అతడి భార్య చనిపోవడంతో ఒంటరిగా ఉంటున్నాడు. నాలుగేళ్ల కిందట తన కుమారులను తండ్రి వద్ద వదిలేసి వరంగల్‌కు వచ్చి కూలిపని చేస్తూ జీవిస్తున్నాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసైన రవి శుక్రవారం తాను చనిపోతున్నానని ఇంటికి ఫోన్ చేసి చెప్పాడు. అనంతరం రాత్రి 8.30గంటలకు సంతోషిమాత గుడి ఎదురుగా ఉన్న రైల్వే ట్రాక్‌పై సికింద్రాబాద్ వెళ్లే ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో తీవ్రంగా గాయపడిన రవి అక్కడికక్కడే మృతి చెందాడు. డిప్యూటీ ఎస్ఎస్ ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ పి.రాజు కేసు నమోదు చేసి పోస్టుమార్టం తర్వాత మృతుడి తండ్రి సమ్మయ్యకు డెడ్‌బాడీ అప్పగించామని సీఐ తెలిపారు.

తెలంగాణను వారి చేతుల్లో పెట్టొద్దు

- బీఆర్ఎస్ పశ్చిమ అభ్యర్థి వినయ్‌భాస్కర్



పార్టీలో చేరిన వారితో దాస్యం వినయ్‌భాస్కర్

హన్మకొండ: కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని తిరిగి దొంగల చేతుల్లో పెట్టొద్దని బీఆర్ఎస్ వరంగల్ పశ్చిమ అభ్యర్థి, చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. ప్రచారంలో భాగంగా 10వ డివిజన్‌లో శనివారం ఇంటింటికి తిరుగుతూ తనను మరోసారి ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. కుడా మాజీ చైర్మన్ యాదవరెడ్డి, కార్పొరేటర్ వేముల శ్రీనివాస్, పార్టీ 10వ డివిజన్ అధ్యక్షుడు ఖలీల్, జనార్దన్‌గౌడ్, సారంగపాణి పాల్గొన్నారు.

సేవ చేసే నాయకుడిని ఆశీర్వదించండి

సేవ చేసే నాయకుడిని ఆశీర్వదించాలని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్, బీఆర్ఎస్ వరంగల్ పశ్చిమ అభ్యర్థి దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో మేరు కుల వెల్ఫేర్ అసోసియేషన్ శ్రీభద్రకాళి మేరు కుల మహిళా పొదుపు, పరపతి సహాయ సహకార సంఘం ఆత్మీయ సమ్మేళనం జరిగింది.

హన్మకొండ అర్బన్: బీఆర్ఎస్ వరంగల్ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి దాస్యం వినయ్‌భాస్కర్ గెలుపు కోసం ఆయన సతీమణి రేవతి, పార్టీ మహిళలు శనివారం ప్రచారం చేశారు.

మూడోసారి ముఖ్యమంత్రి కేసీఆరే

- బీఆర్ఎస్ వర్ధన్నపేట అభ్యర్థి రమేష్



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న రమేష్

హసన్‌పర్తి: అధికారం కోసం ప్రతిపక్ష పార్టీలు పగటి కలలు కంటున్నాయని బీఆర్ఎస్ వర్ధన్నపేట నియోజకవర్గ అభ్యర్థి అరూరి రమేష్ ఎద్దేవాచేశారు. మూడోసారి కూడా కేసీఆర్ ముఖ్యమంత్రి అవుతారని చెప్పారు. నగరంలోని ఒకటవ డివిజన్ ముచ్చర్లకు చెందిన పలు పార్టీల నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో బీఆర్ఎస్‌లో చేరారు. ప్రశాంత్ నగర్‌లోని తన స్వగృహంలో వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఎమ్మెల్యే శనివారం ఆహ్వానించారు. బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు నరేడ్ల శ్రీధర్, చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ గనిపాక విజయ్, నాయకులు ప్రమోద్, అనిల్, కర్ణాకర్, ప్రవీణ్, ప్రతాప్, రాజేష్ పాల్గొన్నారు.

మడికొండలో బీఆర్ఎస్ ఇంటింటి ప్రచారం

మడికొండ: బీఆర్ఎస్ వర్ధన్నపేట అభ్యర్థి అరూరి రమేష్‌ను గెలిపించాలని కోరుతూ 46వ డివిజన్ మడికొండలో కార్పొరేటర్ మునిగాల సరోజన ఆధ్వర్యంలో టీఎస్‌జీఓ కాలనీలో కార్యకర్తలు శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

ప్రజా సంక్షేమానికి పాటుపడుతా..

- కాంగ్రెస్ తూర్పు అభ్యర్థి కొండా సురేఖ



సమావేశంలో మాట్లాడుతున్న సురేఖ

ఖిలా వరంగల్: అందుబాటులో ఉంటూ ప్రజా సంక్షేమానికి పాటుపడుతానని, ఎమ్మెల్యేగా ఆశీర్వదించి భారీ మెజార్టీతో గెలిపించాలని మాజీ మంత్రి, కాంగ్రెస్ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి కొండా సురేఖ కోరారు. వరంగల్ పడమరకోట జంక్షన్‌లో కాంగ్రెస్ నేత గజ్జెల శ్యామ్ అధ్యక్షతన శనివారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఐదేళ్ల క్రితం తాను చేసిన అభివృద్ధే ఇప్పుడు కనిపిస్తోందని, ప్రత్యేక నిధులు తెచ్చి తట్టెడు మట్టిపోసి చేసిన అభివృద్ధి ఎక్కడా కనిపించడం లేదని ఎద్దేవాచేశారు. బీజేపీ జిల్లా నాయకుడు పుప్పాల రాజేందర్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో సాగర్ల శ్రీనివాస్, పుప్పాల జనార్దన్, భాస్కర్, మధుకర్, సురేష్, కన్నయ్య, రవి, విజయ్, అరుణ, సాంబయ్య, కుమారస్వామి, బండి శ్రీను, రాజు, బైరబోయిన రవి, పోశాల సారంగపాణి పాల్గొన్నారు.

ఘనంగా గ్యార్మీ షరీఫ్ ఉత్సవాలు



జెండాకు ప్రార్థనలు చేస్తున్న ముస్లిం మతపెద్దలు

ఖిలా వరంగల్: వరంగల్ - ఖమ్మం జాతీయ రహదారిపై ఖిలా వరంగల్ పెట్రోల్ బంక్ జంక్షన్‌లో ఈద్గా మసీదు అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో శనివారం రాత్రి గ్యార్మీ షరీఫ్ ఉత్సవాలు, జెండా పండగను ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఫోర్ట్‌రోడ్డు ఈద్గా మసీదు అధ్యక్షుడు, తవక్కల్ వెల్ఫేర్ ట్రస్టు ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఎం ఏ.జబ్బార్ పాల్గొని ఉత్సవాలను ప్రారంభించారు. రాత్రి 8గంటలకు గ్యార్మీ షరీఫ్ జెండాను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనంలో ఊరేగించారు. అనంతరం జెండాను గద్దెపై ప్రతిష్ఠించారు. నౌమన్ రజాక్, మహ్మద్ హుస్సేన్, మసూక్, మహ్మద్ జానీ, మహ్మద్ మగ్దుం, దస్తగిరి, యాకూబ్, అశ్రఫ్, షర్ఫొద్దీన్, సాబీర్, మహిమూద్, గౌస్ పాల్గొన్నారు.

ప్రైవేట్ ఉపాధ్యాయులు సంఘటితం కావాలి

హన్మకొండ: భావిభారత పౌరులను తీర్చిదిద్దే ఉపాధ్యాయుల కోసం ప్రత్యేకంగా ఉపాధ్యాయ సంరక్షణ చట్టం తీసుకురావాల్సిన అవసరం ఉందని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. శనివారం హనుమకొండ స్నేహనగర్ కాలనీలోని ఎస్‌వీ ఫంక్షన్ హాల్‌లో విద్యావంతుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఇందులో ప్రైవేట్ విద్యా సంస్థల యాజమాన్యాలు, ప్రైవేట్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. చీఫ్‌విప్ దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ.. ప్రైవేట్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేశానన్నారు. సమ్మేళనంలో కుడా చైర్మన్ సంగంరెడ్డి సుందర్‌రాజు, వడుప్సా తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మాదాల సతీశ్‌కుమార్, ప్రతినిధులు రమేశ్‌బాబు, ప్రైవేట్ డిగ్రీ కళాశాల యాజమాన్యాల ప్రతినిధి రవీందర్, ప్రైవేట్ జూనియర్ కళాశాల యాజమాన్యాల అసోసియేషన్ ప్రతినిధి రామమూర్తి పాల్గొన్నారు.

బీజేపీ గెలుపే ధ్యేయంగా పని చేయాలి

కాశిబుగ్గ: తూర్పు నియోజకవర్గంలో బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎర్రబెల్లి ప్రదీప్‌రావు గెలుపే ధ్యేయంగా బీజేపీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కేంద్ర మాజీ మంత్రి పొన్ను రాధాకృష్ణన్ పిలుపునిచ్చారు. శనివారం ఓ సిటీలోని ప్రదీప్‌రావు క్యాంపు కార్యాలయంలో బీజేపీ డివిజన్ అధ్యక్షులు, శక్తి కేంద్ర ఇన్‌చార్జ్‌లు, బూత్ అధ్యక్షులు, డివిజన్ కో-ఆర్డినేటర్ల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రదీప్‌రావు మాట్లాడుతూ.. బూత్ స్థాయి కార్యకర్త నుంచి ప్రతి ఒక్కరినీ కంటికి రెప్పలా కాపాడుకుంటానన్నారు.

విశ్వరూప సభను విజయవంతం చేయాలి

హన్మకొండ: ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలనే డిమాండ్‌తో ఈనెల 11న హైదరాబాద్‌లో నిర్వహించనున్న మాదిగల విశ్వరూప సభకు కులాలకు అతీతంగా తరలివచ్చి విజయవంతం చేయాలని న్యూశాయంపేటకు చెందిన కుల సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ స్వగ్రామం హనుమకొండ న్యూశాయంపేటకు చెందిన ఆయా కులాల ప్రతినిధులు హనుమకొండ నక్కలగుట్టలోని హరితకాకతీయ హోటల్‌లో శనివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విశ్వరూప సభకు అన్ని కులాలకు చెందిన వారు తరలివెళ్లాలని తీర్మానం చేశారు. అనంతరం, ఎమ్మార్పీఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు సుకుమార్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ సాధన ఉద్యమం అంతిమ దశకు చేరుకున్న క్రమంలో జరుగుతున్న విశ్వరూప సభకు అన్ని వర్గాల ప్రజలు భారీగా తరలివచ్చి సంపూర్ణ మద్దతు తెలపాలని పిలుపునిచ్చారు.

హసన్‌పర్తి: మాదిగ ఉపకులాల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని ఎంఎస్‌పీ హనుమకొండ జిల్లా కోకన్వీనర్ రాజారపు భిక్షపతి కోరారు. హసన్‌పర్తి మండల కేంద్రంలో విశ్వరూప మహాసభ కరపత్రాలను శనివారం ఆవిష్కరించారు. భిక్షపతి మాట్లాడుతూ పార్లమెంట్ సమావేశాల్లో బిల్లు పెట్టాలని డిమాండ్ చేశారు.